అప్పులెలా తీర్చాలని మనస్తాపం

- ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య
- కేసీఆర్ నగర్‌లో విషాదం

రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్లో ప్రవీణ్ (ఫైల్)

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 28: ఆర్థిక ఇబ్బందులతో అప్పులెలా తీర్చాలని మనస్తాపం చెందిన యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, తెలిపిన వివరాల ప్రకారం, తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్ కాలనీకి చెందిన కరిక ప్రవీణ్ (30) 12 సంవత్సరాల క్రితం సిరిసిల్ల పట్టణానికి చెందిన గాయత్రిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు గౌతమ్ (6) నికిత(4) ఉన్నారు. ప్రవీణ్ పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నాలుగు సంవత్సరాల క్రితం సిరిసిల్ల పట్టణంలో కిరాణా షాప్ నిర్వహించగా, దివాలా తీయడంతో రూ.4 లక్షల వరకు అప్పు అయ్యిందని మృతిని భార్య గాయత్రి పేర్కొంది. అప్పటి నుంచి పలుచోట్ల రోజువారీ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని ఆమె తెలిపింది. నిత్యం అప్పులెలా తీర్చేదని మనస్తాపానికి గురయ్యేవాడని భార్య గాయత్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. శివరాత్రి పండుగ ఉండడంతో రెండు రోజుల క్రితం తల్లి గారి ఇంటికి వెళ్లానని, శుక్రవారం ఇంటికి రమ్మని నా భర్త ఫోన్ చేశాడని భార్య తెలిపింది. శనివారం వస్తానని చెప్పినట్లు తెలిపింది. ఈక్రమంలో ప్రవీణ్ తల్లి ఇంటి నుంచి బయటకు వెళ్లడం గమనించిన ప్రవీణ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఇంటికి వచ్చి చూసేసరికి కొడుకు విగత జీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మహనీయుల చిత్రపటాలు ఏర్పాటు చేయాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాగుల రాములు, మూషం రమేశ్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28: ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో నుంచి తొలిగించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, భగత్‌సింగ్ చిత్రపటాలను వెంటనే ఏర్పాటు చేయాలని మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు రాగుల రాములు, మూషం రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ నాయకులు, మేధావులు అఖిలపక్షం నేతలు అందరితో నేడు సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం రాకుండా చేయడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కుట్రను ప్రజలందరూ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నాయకులు గుంటి వేణు, కొంపల్లి విజయ్‌కుమార్, పండుగ రవి, సిరిగిరి బాబు, బాలు, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి
- ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్‌పై వీసీ ద్వారా సమీక్ష

హైదరాబాద్ నుంచి ఇంటర్ పరీక్షల నిర్వహణపై సీఎస్ శాంతికుమారి వీసీ నిర్వహించగా కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అధికారులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. శుక్రవారం ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్‌పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ, మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయని అన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తయిందని, ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరుకున్నాయని, రేపటి నుంచి ప్రశ్నపత్రాలు స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి పోలీస్ స్టేషన్లకు చేరుతాయన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, మార్చి 5, 2025 నుంచి మార్చి 25, 2025 వరకు జిల్లాలో ఇంటర్ పరీక్షలు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఇంటర్ పరీక్షలకు మొత్తం 9310 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఇందుకు 16 సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి శ్రీనివాస్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆర్‌వీ రాధాబాయి, రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రంగినేని ట్రస్టు పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 28: సిరిసిల్ల పట్టణంలోని రంగినేని చారిటబుల్ ట్రస్టు పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని నిర్వాహకులు సుజాత మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలురకు అప్లికేషన్లు తీసుకుంటున్నట్లు వివరించారు. అర్హత సాధించిన వారికి ఉచిత భోజనం, వసతి కల్పించి విద్యనందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 9490733232ను సంప్రదించాలని సూచించారు.

కారు ఢీకొని ఆటో బోల్తా

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 28: సిరిసిల్ల పట్టణంలోని కలెక్టరేట్ చౌరస్తా వద్ద శుక్రవారం కారు ఢీకొనడంతో ఆటోబోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, సిరిసిల్ల నుంచి వేములవాడ వైపు వెళ్తున్న ఆటోను సిద్దిపేట వైపు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న దుబ్బాకకు చెందిన నాగభూషణం (70), పెద్దూర్‌కు చెందిన గీత(33),కవిత(35),రిషి(3)కి గాయాలు కాగా, 108లో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నాగభూషణం తీవ్రంగా గాయపడంతో కరీంనగర్‌కు తరలించారు.

వస్త్రోత్పత్తుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : వస్త్ర ఉత్పత్తుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ మరమగ్గాల యజమానులకు సూచించారు. వస్త్ర తయారీలో సిరిసిల్ల బ్రాండ్ ఇమేజ్ కావాలని ఆకాంక్షించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని కార్యాలయంలో మరమగ్గాల ఆసాములు, యజమానులతో వస్త్ర ఉత్పత్తులు, సమస్యలపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇచ్చిన ఆర్డర్ల వివరాలు ఆమె వెల్లడించారు. ఇచ్చిన ఆర్డర్ల ప్రకారం ఇప్పటివరకు ఎంత ఉత్పత్తి చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమం, సమగ్ర శిక్షా అభియాన్ శాఖలకు సంబంధించి ఆర్డర్ల తయారీ మార్చి 15 వరకు యాభై శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులు, యజమానులను ఆదేశించారు. వస్త్ర ఉత్పత్తుల్లో ఏమైనా ఇబ్బందులుంటే తెలుపాలన్నారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆమె తెలిపారు. జిల్లాలోని యజమానులు, ఆసాములు, కార్మికుల్లో అర్హులైన వా రందరికీ బ్యాంకు రుణాలు ఇచ్చే ప్రక్రియ ను ప్రారంభించినట్లు చెప్పారు. వస్త్ర పరిశ్రమకు సంబంధించిన బకాయిలు త్వరలో విడుదల చేస్తామన్నారు. సిరిసిల్ల నేతన్నల కు ఆరునెలల పాటు నిరంతరం ఉపాధి కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందు కనుగుణంగా యజమానులు, ఆసాములు ప్రణాళికాబద్ధంగా వస్త్ర ఉత్పత్తులు చేసుకోవాలని సూచించారు. ఆరునెలలు ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తుందని, మరో ఆరునెలలు ప్రైవేటుగా మార్కెట్ చూసుకోవాలన్నారు. వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలన్నింటిపైనా చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవలే అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. పరిశ్రమలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఇచ్చిన ఆర్డర్లు తొందరగా పూర్తి చేస్తే, మళ్లీ ఆర్డర్లు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం వేములవాడలో ఏర్పాటు చేసిన యార్న్ బ్యాంకులో తలెత్తిన సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామన్నారు. గతంలో తాము చేసిన ఉత్పత్తులకు సంబంధించిన కరెంటు బిల్లులు చెల్లించాలని యజమానులు శైలజారామయ్యార్‌ను కోరారు. సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, టెస్కో జీఎం రఘునందన్, సందీప్ జోషీ, గౌతమ్, పాలియిస్టర్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం పాలకవర్గం, ఆసాములు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : సిరిసిల్లలో కార్మికుల ఉపాధి, సబ్సిడీ, తదితర సమస్యలు పరిష్కరించాలని చేనేత జౌళిశాఖ కమిషనర్ శైలజారామయ్యార్‌ను సీఐటీయూ నాయకులు కోడం రమణ, మూశం రమేశ్ కోరారు. శుక్రవారం చేనేత జౌళిశాఖ కమిషనర్ శైలజారామయ్యార్ సిరిసిల్లకు రాగా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. ఇక్కడ సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు నక్క దేవదాస్, బెజుగం సురేశ్, బాస శ్రీధర్, స్వర్గం శేఖర్ తదితరులున్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్ల టౌన్/కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సూచించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఎంహెచ్‌వో రజిత ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్కానింగ్ సెంటర్లు నియమ, నిబంధనలు పాటించాలనన్నారు. తనిఖీల సమయంలో గుర్తించిన ఫామ్ ఎఫ్ ఆడిట్‌లను, స్కానింగ్ సెంటర్ల వివరాలు, రేడియోలజిస్ట్ వివరాలు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. నిబంధలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, పీవోఎంఎస్ డాక్టర్ అంజలి, డీజీవో శోభారాణి, ఎన్జీవో చింతోజు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న మహాశివరాత్రి జాతర ఆదాయం 1.3 కోట్లు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28 : మహాశివరాత్రి జాతర మూడు రోజుల రాజన్న ఆదాయం రూ.1,31,89,177 సమకూరినట్లు శుక్రవారం ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.57,12,660, కోడె మొక్కుబడి ద్వారా రూ.45,83,500, ఆర్జిత సేవల ద్వారా రూ.55,706, కేశఖండనం టిక్కెట్ల ద్వారా రూ.3,89,400, శీఘ్రదర్శనం ఒక్కంటికి రూ.100 టిక్కెట్ల ద్వారా రూ.6,97,700, అతి శీఘ్రదర్శనం ఒక్కంటికి రూ.300 టిక్కెట్ల ద్వారా రూ.13,04,100, శ్రీ బద్దిపోచమ్మ ఆలయంలోని టిక్కెట్ల ద్వారా రూ.1,91,390, శ్రీ భీమేశ్వరాలయంలోని టిక్కెట్ల ద్వారా రూ.78,705, శ్రీ నగరేశ్వరాలయంలోని టిక్కట్ల ద్వారా రూ.7,830, ఆలయ వసతి గృహాల అద్దెల ద్వారా రూ.1,05,280, ఇతరాల ద్వారా రూ.62,906 సమకూరినట్లు ఈవో వెల్లడించారు.

ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వీర్నపల్లి, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ మండలాధ్యక్షుడు నేరెళ్ల ముత్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉద్యమ కళాకారుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్‌కార్డు ద్వారా తమ డిమాండ్లను రాసి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. లేదంటే ఉద్యమ కళాకారులతో కలిసి ఉద్యమం ఉధ్రుతం చేస్తామని పేర్కొన్నారు. ఇక్కడ దర్శనాల లింబాద్రి, భూత అంజయ్య, బోయిని రవి, వీటూరి సతీశ్, దేవయ్య, నాగరాజు, జనార్దన్, పరశురాములు, చంద్రమౌళి, గణేశ్, అన్నారం జనార్దన్, జంగం అంజయ్య, దాసరం నారాయణ, దేశరాజు సత్తయ్య, కళాకారులు పాల్గొన్నారు.

'మైనారిటీలను విస్మరించిన కాంగ్రెస్'

బోయినపల్లి (వేములవాడ) ఫిబ్రవరి 28: మైనార్టీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ అజ్జు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా ఇప్పటివరకు మైనార్టీ శాఖకు మంత్రి పదవి ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు మైనార్టీ డిక్లరేషన్‌లో ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పటివరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. షాదీ ముబారక్ చెక్కులు సకాలంలో అందక పేద ముస్లిం కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రంజాన్ మాసం త్వరలో ప్రారంభం కాబోతున్నా ఇప్పటివరకు నిధులు కేటాయించలేదని, ఎలాంటి సమీక్ష సమావేశం నిర్వహించ లేదన్నారు. ఎన్నికల వేళ ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింల కుటుంబాలకు ఎలాంటి కానుకలు ఇవ్వలేదని మండిపడ్డారు. కానీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారని, అన్ని మతాల పండుగలు ఘనంగా జరుపుకునేలా నిధులు కేటాయించారని గుర్తు చేశారు.

దరఖాస్తుల గడువు పెంపు

బోయినపల్లి (వేములవాడ) ఫిబ్రవరి 28: తెలంగాణ మోడల్ స్కూల్ బోయినపల్లిలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో 100 సీట్లకు, 7, 8,9,10 వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశానికి, మార్చి 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న, 6వ తరగతి వారికి ఉదయం పది నుంచి 12 గంటల వరకు, 7,8, 9 ,10 వ తరగతుల వారికి అదే రోజున మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకొని ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా వికసిత్ భారత్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 28 : వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రిన్సిపాల్ శంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ, సీవీ రామన్ కృషి ఫలితంగానే శాస్త్ర సాంకేతిక విభాగాల్లో భారత్ ప్రపంచంలో మంచి స్థానాన్ని సంపాదించిందన్నారు. ఇక్కడ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, శోభారాణి, ప్రసాద్, శ్రీధర్ రావు, కరుణ అధ్యాపకులున్నారు.

కుక్కల దాడిలో 13 మేకలు మృతి

గంభీరావుపేట, ఫిబ్రవరి 28: మండలంలోని నర్మాలకు చెందిన ఓరుగంటి వెంకటి మేకల మందపై శుక్రవారం వీధి కుక్కలు దాడి చేయగా 13 జీవాలు మృతి చెందాయి. దొడ్డిలో ఉంచిన మేకల మందపై ఒక్కసారిగా కుక్కలు ఎగబడ్డాయని యజమాని వెంకటి తెలిపారు. దీంతో 13 జీవాలు మృతి చెందగా రూ.1లక్షకు పైగా నష్టం జరగిందన్నారు. వెంకటి కుటుంభాన్ని ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు.

చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఆరు నెలల జైలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 28: మండల కేంద్రానికి చెందిన రాగుల బాల్‌రెడ్డిపై అప్పు ఇచ్చిన వ్యక్తికి చెక్కు ఇచ్చి తగిన నగదును బ్యాంకులో జమచేయని కారణంగా చెక్ బౌన్స్ కేసులో ఒకటో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కే సృజన బాల్‌రెడ్డికి ఆరునెలల శిక్షతో పాటు రూ.5 లక్షలు చెల్లించాలని తీర్పు వెల్లడించింది. బాధితుడు అందించిన వివరాల ప్రకారం, మండల కేంద్రానికి చెందిన నంది కిషన్ వద్ద బాల్‌రెడ్డి తన అవసరాల కోసం రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీన్ని తిరిగి చెల్లించేందుకు హామీగా బాల్‌రెడ్డి చెక్కును నంది కిషన్‌కు ఇచ్చాడు. సదరు చెక్కును బ్యాంకులో జమ చేయగా సరిపడా అమౌంట్ లేక చెక్ బౌన్స్ అయింది. దీంతో నంది కిషన్ కోర్టును ఆశ్రయించగా శుక్రవారం మెజిస్ట్రేట్ బాల్‌రెడ్డికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.5లక్షలు చెల్లించాలని తీర్పు వెల్లడించినట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

గాంధీ చౌక్, ఫిబ్రవరి 28: అతివేగంగా ఆటో నడిపి చిన్నారి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.4100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అదనపు ప్రథమశ్రేణి మెజిస్ట్రేట్ కావేటి సృజన శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, 29 జూన్ 2016న గంభీరావుపేట మండలం దమ్మన్నపేట చిన్నారి గుగులోతు సంజన(7) ఇంటి ఎదుట నిలబడి ఉండగా గంభీరావుపేటకు చెందిన ఆటోడ్రైవర్ లింగంపల్లి శ్రీనివాస్ అతివేగంగా వచ్చి సంజనని ఢీకొట్టడంతో దవాఖానలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటనపై గంభీరావుపేట పోలీసులు ఆటోడ్రైవర్ లింగంపల్లి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సతీశ్ గౌడ్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ జనార్దన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించారు.

ప్రజా సమస్యలపై కేసులకు భయపడం

- ముస్తాబాద్ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి

కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 28 : ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కేసులు పెట్టినా భయపడేది లేదని బీఆర్ఎస్ పార్టీ ముస్తాబాద్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పొలాలు ఎండడంతో కడుపు మండి రైతులు రోడ్డెక్కితే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ కేసులు పెట్టడమేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజలు నిలదీస్తున్నారన్నారు. ఎండలు ముదిరి భూగర్భ జలాలు అడుగంటి వేసిన పంటలు ఎండుతుంటే కడుపు మండి రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తూ కేసులు పెడుతున్నదని, ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే అని ప్రశ్నించారు. రైతులపై కేసులు పెడితే న్యాయపరంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ రైతులను గుండెల్లో పెట్టుకొని చూసుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వంలా జైలుకు పంపలేదని తెలిపారు. ఇక్కడ నాయకులు పడిగె ఆంజనేయులు, కోడె శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ఉద్యోగులకు విరమణ తప్పనిసరి'



విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తమ పూర్తి సమయాన్ని కుటుంబానికి కేటాయించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించి హౌసింగ్ పీడీ బీ చిన్నయ్య, డీ సెక్షన్ సూపరింటెండెంట్ జావిద్ అహ్మద్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఇక్కడ సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆర్వీ రాధాభాయ్, రాజేశ్వర్, సీపీవో శ్రీనివాసాచారి, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, ఆయా శాఖల ఉన్నతాధికారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలను కాపాడండి

- నీటి పారుదల శాఖ ఈఈకి తెర్లుమద్ది రైతు వినతి

మానేరు నీటిని విడుదల చేయాలని నీటి పారుదల శాఖ ఈఈకి వినతి పత్రం ఇస్తున్న రైతు నవీన్

ముస్తాబాద్, ఫిబ్రవరి 28: ఎగువ మానేరు నీళ్లు ముస్తాబాద్ వరకు వస్తున్నాయని, తెర్లుమద్దిలోని ఆయకట్టుకు వారంలో రెండు రోజులు విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని గ్రామానికి చెందిన రైతు బైతి నవీన్ వేడుకున్నాడు. ఈ మేరకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నీటిపారుదల శాఖ ఈఈ అమరేందర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చాడు. గ్రామంలోని రైతులు ఎగువ మానేరు నీళ్లు వస్తాయనే ఆశతో పంటలు వేశారని, ప్రస్తుతం బోర్లు, బావుల్లో నీళ్లు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగువ మానేరు నీళ్లు వారంలో రెండు రోజులు విడుదల చేసి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ దినోత్సవం

వేములవాడ : కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

వేములవాడ/బోయినపల్లి (వేములవాడ)/రుద్రంగి, ఫిబ్రవరి 28 : వేములవాడ పట్టణంలో ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని లేడీస్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ సింగర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రెడీమేడ్ దుస్తుల వల్ల చాలా మంది వృత్తిని కొనసాగించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడ టైలర్స్‌కు ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్స్ ఇప్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు వాసం భూమేశ్, క్యాషియర్ ఖాజా నహిముద్దీన్, ప్రధాన కార్యదర్శి కోడం సురేశ్, ఉపాధ్యక్షుడు గుడిసెల ఆశ, సంయుక్త కార్యదర్శి సంగీత, సహాయ కార్యదర్శి నాగుల సురేశ్, శ్రీపతి సతీశ్, గణేశ్, మోహన్, భాగ్యశ్రీ, మధుమిత, లహరి, వజ్రమ్మ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, బోయినపల్లి మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో టైలరింగ్ దినోత్సవం నిర్వహించారు. ఇక్కడ హెచ్ఎం బొలగం శ్రీనివాస్, టైలరింగ్ ఉపాధ్యాయురాలు కేశవరాజు శమంతకమణి,